క్లుప్తంగా

జన్మదిన శుభాకాంక్షలు



కాంగ్రెస్ నాయకుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న బండి శ్యామ్‌గౌడ్

చింతల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బండి శ్యామ్‌గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం చింతల్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. కుత్బుల్లాపూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బంటు నరేష్ ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో కుత్బుల్లాపూర్‌కు చెందిన యూత్ కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని శ్యామ్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సువారి శ్రీనివాస్, గణేష్, రమేష్, నూతన్, శివాజీ, రాజేష్, రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో ఎమ్మెల్సీ రాజు పూజలు



కుత్బుల్లాపూర్: ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంగళవారం కాణిపాకం వరసిద్ధి వినాయకుడి దర్శించుకున్నారు. ఈ పూజలో సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నాయకులు పోలీస్ గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

చింతల్: రవీంద్రభారతిలో ఈనెల 13న జరిగే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలకు గౌడ కులస్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల శ్రీనివాస్‌గౌడ్, జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్ కోరారు. జైగౌడ్ ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి బీసు వెంకటేశంగౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందకు అందజేశారు. బొమ్మగాని శంకర్‌గౌడ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన



ప్రభుత్వ భూముల వివరాలను ఆర్డీవోకు వివరిస్తున్న తహసీల్దార్

సుభాష్‌నగర్: ఇటీవల నూతనంగా మల్కాజ్‌గిరి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామ్‌ప్రకాష్ మంగళవారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని మొదటిసారిగా సందర్శించారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ వినయ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుకలతో కలిసి గాజులరామారం డివిజన్ పరిధి దేవేందర్ నగర్‌లోని సర్వే నంబర్ 307, 329 ప్రభుత్వ భూములను పరిశీలించారు. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

వృద్ధుడిని వదిలేసి వెళ్లిపోయిన గుర్తుతెలియని వ్యక్తులు

సుభాష్‌నగర్: అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలేసిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శివహిల్స్ సమీపంలో మంగళవారం ఓ వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీనిపై స్పందించిన సీఐ వెంకటేశ్వర్లు గుర్తు తెలియని వృద్ధుడిని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబర్ 11 నుంచి గీతంలో అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌స్‌లోని భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 11–13 తేదీలలో 'ఘనీభవించిన పదార్థ భౌతిక శాస్త్రంలో పురోగతి' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. పరిశోధనలో భవిష్యత్తు పోకడలపై దృక్పథాన్ని అందిస్తుందని, సంభావ్య సహకారాన్ని పెంపొందించే అవకాశాలను శోధించేలా ఈ సదస్సు ప్రేరేపిస్తుందన్నారు. ఈ సదస్సులో పత్ర సమర్పణ ఆగస్టు 25వ తేదీలోపు చేయొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ఐవీ సుబ్బారెడ్డి 96181 77690ని సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్యే వివేకానంద్‌తో సమావేశమైన నిజాంపేట్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

నిజాంపేట్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా మంగళవారం ఆయన సూరారం డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్, న్యూ షాపూర్‌నగర్‌లలో పాదయాత్ర నిర్వహించారు. స్థానికంగా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మిగతా పనులను సైతం త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పనితీరుపై సంతోషంగా ఉన్నారని తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

◆ నిజాంపేట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. తమను పర్మినెంట్ చేయడంతో పాటు జీతాలు పెంచాలని కోరగా ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

వైద్యచికిత్స సంచార వాహనం ప్రారంభం

◆ సూరారం టీఎస్ఐఐసీ కాలనీలో ఆధ్వర్యంలో వయోవృద్ధుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యచికిత్స సంచార వాహనాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆరోగ్య తెలంగాణయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒకరికి మెరుగైన వైద్యం అందించాలనే ధృఢ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ మేడ్చల్ మల్కాజ్‌గిరి చైర్మన్ రాజేశ్వర్ రావు, శ్రీనివాస్ నాయుడు, జీహెచ్ఎంసీ ఆసరా సెంట్రల్ కమిటీ వైస్‌చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయిబాబా పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై కలెక్టర్ ఆరా



కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ అమోయ్‌కుమార్

కుత్బుల్లాపూర్: ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా మేము రెడీ అంటున్నారు అధికారులు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొత్త ఓటర్ల నమోదు పోలింగ్‌స్టేషన్ల వివరాలను మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ పరిశీలించారు. కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సెంటర్‌ను సందర్శించిన ఆయన అక్కడి నుంచి లయోలా కాలేజీ పరిశీలించారు. నియోజకవర్గంలో గత ఎన్నికలకు పోలిస్తే ఈ అసెంబ్లీ ఎన్నికలకు ఏకంగా లక్ష ఓట్లకు పైగానే పెరగడం విశేషం.

◆ 6,35,951 మంది ఓటర్లు నమోదు కాగా 1400 మందికి ఒక పోలింగ్ స్టేషన్ చొప్పున సుమారు 582 కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు చేస్తున్నారు. భూసేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పులి సైదులును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమించారు. మరో తొమ్మిది మందిని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ నిజాంపేట్, ఎల్ఎస్‌జీ, ఎస్ఎంఎస్ ఫీడర్ల పరిధిలోని బాచుపల్లి సిగ్నల్స్, శ్రీకర విల్లాస్, శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి పోచమ్మ ఆలయం, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో...

కుత్బుల్లాపూర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం కొంపల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలోని గోదావరి హోమ్స్, గాయత్రినగర్, టీఎస్ఆర్ గార్డెన్స్ ఏరియాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

గాజులరామారం సెక్షన్ పరిధిలో..

సుభాష్‌నగర్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం గాజులరామారం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. యండమూరి లేఅవుట్, మల్లారెడ్డినగర్, ద్వారకనగర్, మహదేవపురం, రాంకీ ఎస్టేట్స్, సంస్కృతి ఎవెన్యూ, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిది



విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లు అందజేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

కుత్బుల్లాపూర్: విద్యార్థులకు విద్యను అందించే విషయంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే తప్పకుండా ఫలితాలు ఉంటాయన్నారు. ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, ప్రభుత్వ అధికారులుగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ఎంతోమంది విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు.

'మనూ' దూరవిద్య కోర్సులలో ప్రవేశాలు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వివిధ దూర విద్యా కోర్సులలో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తోందని డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రజావుల్లాఖాన్ మంగళవారం తెలిపారు. దూర విద్యా కోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ఆన్‌లైన్ అడ్మిషన్లను అందిస్తోందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 25 చివరి తేదీగా అని తెలిపారు. అడ్మిషన్ ఫీజును ఆగస్టు 31 వరకు చెల్లించవచ్చన్నారు. దూర విద్యా కోర్సులలో ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, ఇస్లామిక్ స్టడీస్, బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ (ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్ నంబర్లు 040-23008463, 040-23120600 (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)ని సంప్రదించాలని కోరారు.

సత్తాచాటిన జపాన్ షోటోకాన్ కరాటే ఫెడరేషన్

జగద్గిరిగుట్ట: కర్నాటకాలోని శివమొగ్గ ఇండోర్ స్టేడియంలో ఈనెల 5వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగిన 4వ అంతర్జాతీయ కరాటే పోటీలలో జపాన్ షోటోకాన్ కరాటే ఫెడరేషన్ ఇండియా తమ సత్తా చాటింది. కూకట్‌పల్లి, గాజులరామారం ఉన్న జపాన్ షోటోకాన్ కరాటే ఫెడరేషన్ శిక్షణ తీసుకున్న 15 మంది విద్యార్థులతో పాటు కరాటే ఫెడరేషన్ చీఫ్ ఎస్.ప్రభాకర్, తెలంగాణ ఇన్‌స్ట్రక్టర్ సాయికుమార్ రవికుమార్, శివకుమార్ కర్నాటక వెళ్లారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులు కతా, కుమిటీ విభాగాలలో 13 స్వర్ణం , 6 వెండి, 9 కాంస్య పతకాలు సాధించారు. తమ దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఈ పతకాలు సాధించడం సంతోషంగా ఉందని జపాన్ షోటోకాన్ కరాటే ఫెడరేషన్ ఇండియా సభ్యులు తెలిపారు.

సామాజిక శాస్త్రాల మనుగడకు కొత్త ఆవిష్కరణలు చేయాలి

రాయదుర్గం: సామాజిక శాస్త్రాలు ప్రస్తుతం, భవిష్యత్తులో మనుగడ సాగించాలంటే కొత్త ఆవిష్కరణలు చేయాలని ఉర్దూ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ హెచ్ఆర్‌డీసీ ఆధ్వర్యంలో రాజనీతి శాస్త్రం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో రిఫ్రెషన్ కోర్సు ప్రారంభోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ తత్వశాస్త్రం కంటే పాశ్చాత్య తత్వశాస్త్రం గురించి మనకు ఎక్కువ తెలుసన్నారు.

గుంతల రోడ్లతో నరకం



సెంట్రల్‌పార్క్‌లోని నల్లపోచమ్మ ఆలయం సమీపంలో నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

కుత్బుల్లాపూర్: రోడ్లపై గుంతలతో వాహనదారులకు నరకప్రాయంగా మారుతోందని బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ పరిధి సెంట్రల్ పార్క్‌లోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంత వద్ద కూర్చుని బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారి పడి గాయాల పాలవుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు ప్రతినిత్యం ఇదే రహదారిలో వెళ్తున్నా వారికి సమస్య కనిపించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని కోరారు. నాయకులు సతీష్ సాగర్, శివాజీ రాజు, అశోక్, మహేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సరిత, మాధురి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం



దరఖాస్తుల కార్యక్రమంలో పాల్గొన్న సొంటి రెడ్డి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్ల ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పింఛన్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం ఉండటం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పింఛన్ దరఖాస్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికి పింఛన్లు అందజేస్తామన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో వెలసిన నిర్మాణాలపై దృష్టి



సుభాష్‌నగర్: ఇటీవల కుత్బుల్లాపూర్ మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న వినయ్‌కుమార్ ప్రభుత్వ స్థలాల్లో వెలసిన నిర్మాణాలపై దృష్టి సారించారు. మంగళవారం వినయ్ కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక ఆధ్వర్యంలో దేవేందర్‌నగర్ సర్వే నంబర్.307లో ఐదు గదులను కూల్చివేశారు. ఆరు నెలల వ్యవధిలో వినయ్‌కుమార్ జగద్గిరిగుట్ట, గాజులరామారం, సూరారం ప్రభుత్వ భూముల కబ్జాలపై ఉక్కుపాదం మోపి పలువురుపై కేసులు నమోదు చేయించారు. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టి రెండు రోజుల వ్యవధిలో కూల్చివేతలు చేపట్టడంపై కబ్జాదారులు ఆందోళన చెందుతున్నారు.

పార్కు గేట్‌కు తాళం

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- అధికారులకు రూ.10వేలు చెల్లించి అనుమతి
- 2024 వరకు అనుమతి ఉన్నా అనుమతించని వైనం



కుత్బుల్లాపూర్: పార్కు స్థలంలో స్కూల్ పిల్లలు ఆడుకోకుండా ప్రధాన గేటుకు తాళం వేయడం వివాదాస్పదంగా మారింది. కొన్ని నెలలుగా స్థానిక సంక్షేమ సంఘం పేరుతో కొంతమంది విద్యార్థులను బెదిరించి వెళ్లగొట్టగా ప్లే గ్రౌండ్ పర్మిషన్ తీసుకుని పిల్లలను ఆడిస్తూ వచ్చారు. ఇంతలో హార్టికల్చర్ అధికారులు పార్కు స్థలంలో ప్రధాన గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు.

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వెన్నెలగడ్డ సమీపంలో ఉన్న సెయింట్ ఆంటోనీ స్కూల్ విద్యార్థులు ప్రతిరోజు పక్కనే ఉన్న పార్కు స్థలంలో క్రీడలు ఆడుకుంటూ వస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఇదే పద్ధతి కొనసాగుతూ వస్తోంది.

◆ ఇటీవల కొంతమంది పక్కనే నిర్మాణం చేపట్టి అందులో వివిధ భవన నిర్మాణ సామగ్రిని వేయడం విద్యార్థులు అడ్డు చెప్పడం.. ఈ విషయంపై వారు పంతాలకు పోయి స్కూల్ విద్యార్థులను పార్కులో ఎంటర్ కాకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. దీంతో స్కూల్ యాజమాన్యం కూకట్పల్లి జోనల్ కమిషనర్ మమతను కలిసి ఆన్‌లైన్‌లో రూ.10వేలు చెల్లించి మార్చి 2024 వరకు అనుమతి తీసుకొచ్చారు.

◆ అయితే హార్టికల్చర్ అధికారులు సోమవారం అకస్మాత్తుగా ప్రధాన గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఇదే విషయంపై హార్టికల్చర్ అధికారులను సాక్షి వివరణ కోరితే పర్మిషన్ ఇచ్చిన విషయం తమకు తెలియదని చెప్పడం గమనార్హం. తాళం వేయడం వెనుక రాజకీయ కోణం ఉందన్నారు.

◆ కావాలనే తమపై కక్ష సాధింపులకు పోతున్నారని, అన్ని విషయాలను త్వరలోనే చెబుతానని సెంట్ ఆంటోనీ స్కూల్ అధినేత సుందర్ రాజు స్పష్టం చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునే సమస్య లేదని ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

'మేరా భారత్ మహాన్'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

నిజాంపేట్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మేరా భారత్ మహాన్'కార్యక్రమంలో భాగంగా 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆగస్టు 14వ తేదీ ఉదయం 9 – 10 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో పాల్గొనడానికి సంస్థ వెబ్‌సైట్ https://viswaguruworldrecords.com లోని గూగుల్ ఫామ్‌ను పూరించి సంబంధిత పాఠశాలలు, కళాశాలలు తదితర సంస్థలు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని సంస్థ నిర్వాహకుడు సీఈవో రాంబాబు తెలిపారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా అశోక ధర్మ చక్రంలోని 24 ఆకులు సూచించే 24 విలువల ప్రాముఖ్యం గురించి తెలుసుకోవడంతో పాటు ఆ గుణాలను అలవర్చుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 99599 71679.

అద్భుతం.. క్విట్ ఇండియా నాటక రూపకం

సుభాష్‌నగర్: భారతదేశానికి స్వాతంత్రం తీసుకురావడానికి మహనీయుల పోరాటపటిమ,చేసిన ఉద్యమాల గురించి నేటి తరానికి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్ ముదిరాజ్ అన్నారు.మంగళవారం సూరారంలోని స్కూల్‌లో క్విట్ ఇండియా ఉద్యమం ఎనిమిది దశాబ్దాలు పూర్తి చేసుకున్న క్విట్ ఇండియా డేను నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమం, బ్రిటిష్ వారి పాలన అంతమొందించడానికి 1942లో మహాత్మా గాంధీ ప్రారంభించిన ఉద్యమాన్ని స్మరిస్తూ చిన్నారులు నాటక రూపకంలో ప్రదర్శన చేశారు.



క్విట్ ఇండియా, భారత స్వాతంత్ర పోరాట ఉద్యమాలను నాటకరూపంలో ప్రదర్శిస్తున్న నార్త్ సిటీ హైస్కూల్ విద్యార్థులు

భారీ వాహనాల పార్కింగ్‌పై ఫిర్యాదు



జీడిమెట్ల ట్రాఫిక్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

జీడిమెట్ల: రోడ్డుపైన వాహనాలు పార్కింగ్ చేస్తూ రాకపోకలకు ఇబ్బంది కలుగజేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మంగళవారం ఐలా కమిషనర్, జీడిమెట్ల సీఐలకు వినతిపత్రాలు అందజేశారు. జీడిమెట్ల డిపో నుంచి ఎస్ఆర్ నాయక్‌నగర్, అపురూపకాలనీకి వెళ్లే రోడ్డులో కొంతమంది విచ్చలవిడిగా ట్రక్కులు, కంటైనర్స్, లారీలను పార్కింగ్ చేస్తున్నారని గబ్బుల లక్ష్మీనారాయణ అన్నారు. దీంతో వాహనాలక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందన్నారు.

◆ నాలుగేళ్ల క్రితమే జీడిమెట్లకు లోడింగ్, అన్‌లోడింగ్ నిమిత్తం వచ్చే భారీ వాహనాల కోసం ఐలా కార్యాలయం దగ్గరలో పార్కింగ్ స్థలాన్ని కేటాయించారు. అయినా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తూ ప్రజారవాణాకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు ఫోన్‌లో ట్రాఫిక్ అధికారులకు, ఐలా అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో అడబాల వెంకటరత్నం, మల్లేష్‌గౌడ్, సురేష్ నాయుడు, ఎస్.కె.హనోక్‌లు ఉన్నారు.

శ్మశానవాటిక స్థలం సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు



జేసీబీని అడ్డుకుంటున్న స్థానిక బంజారా మహిళలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లోని సర్వే నం.329/1 హిందూ శ్మశానవాటిక నిమిత్తం కేటాయించిన రెండు ఎకరాలను మంగళవారం సర్వే నిర్వహించారు. సర్వేయర్ సునీత, ఏఈ కళ్యాణ్ అధికారులు కలిసి ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న బంజారా వాసులు గ్రేవ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకించారు. గతంలో గ్రేవ్ యార్డ్ ఒకచోట అని చెప్పి ప్రస్తుతం మా ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ దేవాలయాని ఆనుకొని ఏర్పాటు చేయడం సరి కాదని మండిపడ్డారు. అధికారులు ఈ నిర్ణయాన్ని మార్చుకుని దేవాలయానికి దూరంగా గ్రేవ్‌యార్డు ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

బీబీఏలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



కోర్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఇండియన్ కలినరీ ఇనిస్టిస్యూట్ తిరుపతి (భారత ప్రభుత్వ టూరిజం మంత్రిత్వ శాఖ అనుబంధం) లో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) ఇన్ కలినరీ ఆర్ట్స్ 3 సంవత్సరాల డిగ్రీ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇనిస్టిస్యూట్ ట్రెనింగ్, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ పి.చల్లేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కోర్సు కరపత్రాన్ని సెలబ్రిటీ చెఫ్ సంజయ్ తుమ్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఇంటర్‌మీడియట్ 50 శాతం మార్కులతో పాస్ అయిన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. సెప్టెంబర్ 1 నుండి క్లాసులు ప్రారంభమౌతాయని ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దేశ విదేశాలకు చెందిన వెరైటీ వంటలు ఇందులో నేర్పుతారని, 100 శాతం ప్లేస్‌మెంట్ ఉంటుందన్నారు. మూడు సంవత్సరాల కోర్సు పూర్తిచేసుకున్న వారికి ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ పట్టా అందిస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు www.icitirupati.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.